
# కథ మొదలయ్యింది




బయల్దేరవలసిన టైము తొమ్మిదిన్నరే అయినా గుంటూరు నించి హైదరాబాద్ వెళ్లే బస్సు పదినిముషాలు తక్కువ పదిగంటలకు బయల్దేరింది.

చలికాలం వెళ్లిపోయినా చలిమాత్రం వెళ్లిపోలేదు. అంతకుముందే భోజనం చేసి వుండటం వల్ల వేగంగా వెళుతున్న బస్సులో చలిగాలి నన్ను మరింత బాధించింది. విండో గ్లాసును మూశాను. ప్రయాణీకులు బస్సు నిండుగా ఉన్నారు.

ఊరు దాటగానే లైట్లు ఆర్పేశాడు డ్రయివరు. అప్పటిదాకా నవలలు చదువుతున్న

కొంతమంది మనుషులు పుస్తకాలు మూసి నిద్రపోయే ప్రయత్నాలు చేశారు.

గొప్ప బాధ్యతాయుతమయిన పనిని తనకు అప్పగించినట్లుగా బస్సును నడుపుతున్నాడు డ్రయివరు. నిటారుగా సీట్లో కూర్చుని దృష్టిని సూటిగా రోడ్డుమీదకు మళ్లిస్తున్నాడు. దాదాపుగా బస్సులోని వాళ్లంతా నిద్రకోసం ప్రయత్నాలు చేస్తున్నారు. నేనుకూడా సర్దుకుని కూర్చుని కళ్లు మూసుకున్నాను, నిద్ర వస్తుందేమోనని.

నిద్ర రాలేదుగానీ కళ్లముందు శకుంతల రూపం కదలాడింది. అప్పుడు మనసులో ఒక విధమయిన అలజడి బయల్దేరింది.

శకుంతల-

అందానికి ప్రతిరూపం. అందానికి డెఫినిషన్. శకుంతలే హైదరాబాద్‌లో లేకుండా వున్నట్లయితే విద్యాసాగర్ పెళ్ళికి వెళ్లకుండా వుండేవాడిని. ఇప్పుడు వాడి పెళ్లికి వెళుతున్నానంటే అందుకు వాడు పరోక్షంగా శకుంతలకు థాంక్స్ చెప్పుకోవాలి.

ఎన్నాళ్లనించో శకుంతలను ఒకసారి చూడాలనే బలమయిన కోరిక విద్యాసాగర్ పెళ్లి శుభలేఖ చూడడంతో మరింత బలంగా తయారయింది. అప్పుడే నిర్ణయించుకున్నాను ఈ పెళ్లికి వెళ్లక తప్పదని.

"విద్యాసాగర్ మీకు అంత క్లోజు ఫ్రెండా?" అని అడిగింది నా అర్ధాంగి వాడి పెళ్లికి వెళుతున్నానని చెప్పినప్పుడు.

"అవును. నేను వెళ్లకపోతే వాడు తప్పకుండా బాధ పడతాడు" అన్నాను మనసులో శకుంతలను తలుచుకుంటూ-

అసలు మధ్యాహ్నం కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లోనే వెళ్లేవాడిని. కాని లీవు దొరకలేదు. పెళ్లి రేపు ఉదయం పదిన్నరకు. అందుకే ఈ రాత్రి బయస్సుకు బయల్దేరాను.

బస్సు బాగా వేగంగా వెళుతోంది. అయినా ఇంకా తొందరగా వెళితే బావుండునని పించింది. ఎప్పుడు హైదరాబాద్ వెళ్లిపోతానా అనే ఆత్రంగా వుంది. శకుంతల ఎడ్రసు కాయితం నా జేబులో వుంది. అసలు ఆ కాయితం అనవసరం. ఎడ్రసు నాకు బాగానే గుర్తుంది. అయినా మరచిపోతానేమోనని భయం. ఇప్పుడు శకుంతల యేం చేస్తూ వుంటుంది? భర్త కౌగిల్లో కరిగిపోతూ వుంటుందా?

తన దురదృష్టాన్ని నిందించుకుంటూ విచారపడుతూ వుంటుందా?

నిజంగా ఆమె జీవితం విషాదం.

అందం దేవుడిచ్చిన వరం. కాదనను. కానీ అంతమాత్రాన ఒక అందమయిన మనిషి జీవితాన్ని మరో అందమయిన మనిషి పంచుకోవాలని ఎక్కడాలేదు. ఒకవేళ అలా జరగ నప్పుడు జీవితాంతం కుళ్లిచావటం అవివేకం. జీవితంతో రాజీపడి ముందుకు వెళ్లటం

తెలివిగలవాళ్ళ లక్షణం. జీవితాన్ని ద్వేషిస్తూ బతికే మనుషులంటే నాకు తగని జాలి.

ఇప్పుడు శకుంతల కూడా ఇలాంటి పరిస్థితుల్లోనే వుందని నా అనుమానం. అవునో, కాదో, అక్కడకు వెళ్లి ఆమెను కలుసుకుంటేగానీ తెలీదు.

అందమైన శకుంతల పరిచయం కోసం, స్నేహం కోసం నేను పడిన తపన, శ్రమను తల్చుకుంటే ఇప్పుడు నాకు ఆశ్చర్యంగా వుంటుంది. అంత తపన పడిన వాడిని ఆమెను చేసుకోగలిగానా అంటే అదీ లేదు. అది నా దురదృష్టం. ఇందుకు ఎవ్వరూ బాధ్యులు కారు. అప్పటి నా పరిస్థితులే కారణం.

ఎంతో శ్రమపడి శకుంతలతో పరిచయం చేసుకొనే ప్రయత్నంలో వున్నప్పుడే శకుంతల తండ్రి ఆమెకు నన్ను లెక్కలు చెప్పవలసిందిగా అడగటం నాలో ఆశ్చర్యాన్ని, సంతోషాన్ని కలిగించింది. ఆయన మా నాన్నకు స్నేహితుడు.

ఇంతకంటే కావలసింది యేముంది? నాకు లెక్కలు బాగానే వచ్చును. ఆమె ఇంటర్ చదువుతోంది. నేను డిగ్రీ ఫస్టియర్‌లో వున్నాను.

ట్యూషన్ మొదలయ్యింది. మొదటిరోజు శకుంతలకు ఏమీ చెప్పలేకపోయాను. శకుంతల ఒక్కసారి నా కళ్లలోకి చూసేసరికి నాకు మాట రాలేదు. ఎంత ప్రయత్నం చేసినా పెదమలు విచ్చుకోలేదు. ఆమె చూపులో అంత బలం వుంది. మరింత అందం వుంది.

రెండో రోజు సాధ్యమయినంతవరకు ఆమె కళ్లలోకి చూడకుండానే లెక్కలు చెప్పాను. రోజులు గడుస్తున్నకొద్దీ ఆమె దగ్గర నా సిగ్గు వదిలిపోయింది. స్వేచ్ఛగా మాట్లాడటం మొదలు పెట్టాను. ఆమె కూడా అంతే. ఆమె మాటలు నన్ను ఆరాధిస్తున్నట్టుగా వుండేవి. మాటలే కాదు- చూపులు కూడా. అప్పుడప్పుడు పువ్వులాంటి శకుంతల వొళ్లు నాకు తగిలేది. షాక్ కొట్టినట్టు, ఏదో విద్యుత్తు నాలోకి ప్రవేశించినట్టు అనిపించేది. కావాలనే ఆమె చేతులు తాకేవాడిని. ఆమెలోని ప్రతి అణువూ ఎంతో అందంగా కనపడేది. ఆమె అందం నన్ను పరవశుడిని చేసేది.

కేవలం లెక్కలే కాకుండా ఇద్దరం ప్రేమ గురించి మాట్లాడుకునే వరకూ వచ్చాము.

నేనంటే ఆమెకు ఇష్టం. శకుంతల అంటే నాకూ ఇష్టమే.

శకుంతల ఇంటర్ పాసయ్యింది. నాకు థాంక్స్ చెప్పింది. ఆరోజు ఆమెను నాతో సినిమాకు రమ్మన్నాను. వచ్చింది. పక్కపక్కనే కూర్చుని ఏవేవో విషయాల గురించి మాట్లాడుకున్నాము. నేనయితే అసలు సినిమా చూడలేదు. చిన్నగా ఆమెతో మాట్లాడటమే సరిపోయింది.

"డిగ్రీలో చేరతావా?" అడిగాను.

"నాకు చదవాలనే వుంది. కానీ చదివించే శక్తి నాన్నకు లేదు"

"అయితే ఏం చేస్తావ్?"

"చేసేదేముంది? వాళ్లే చేస్తారు పెళ్ళి" చిన్నగా నవ్వుతూ అన్నది.

"అప్పుడే పెళ్లా!" ఆశ్చర్యంగా అడిగాను.

"మీరలాగే అంటారు. మా ఇంట్లో నాకు ఎప్పటినించో సంబంధాలు చూస్తున్నారు. ఇంటర్ అయిపోగానే పెళ్లి చెయ్యాలని మానాన్న ఎప్పుడో అన్నాడు. త్వరలోనే ఏదో వొక సంబంధం కుదరవచ్చు....." నా కళ్లలోకి చూస్తూ అన్నది శకుంతల.

మాట్లాడలేదు. నా గుండెలో ఏదో అలజడి మొదలయ్యింది. శకుంతల మరో వ్యక్తిని పెళ్ళి చేసుకుంటే నేను భరించగలనా?

రెండు నెలలు గడిచాయి.

ఒకరోజు చీకటి పడుతున్నవేళ శకుంతల దగ్గరకు వెళ్లాను. డాబామీద వుంది. చాపమీద పడుకుని చంద్రుడిని చూస్తోంది. నన్ను చూడగానే లేచి కూర్చుంది. ఆమె ఎదురుగా చాపమీద కూర్చున్నాను.

"రేపు నేనే మిమ్మల్ని కలవాలని అనుకున్నాను" అన్నది.

"ఎందుకు? ఏదయినా పనుందా?"

"ఒక విషయం చెప్పటానికి"

"ఏమిటా విషయం?" కుతూహలంగా అడిగాను.

"ముందు నాకు ఈ విషయం చెప్పండి. మీరు నన్ను ప్రేమిస్తున్నారా?"

"ఎందుకొచ్చింది ఈ అనుమానం?"

"అనుమానం కాదు. నాకు ఓ సంబంధం కుదిరింది. నిజంగా మీరు నన్ను ప్రేమిస్తే, నేను మీకు కావాలని అనుకుంటే మీరు నన్ను ఇప్పుడు పెళ్లిచేసుకోగలరా?"

ఆలోచనలో పడ్డాను.

"ఏమిటి? ఆలోచిస్తున్నారు?"

"నువ్వు నాదానివి కావటం కంటే నేను కోరుకునేది ఏదీ లేదు. కానీ ఇప్పుడే పెళ్లంటే ఎలా? ఇంక చదువు పూర్తికాలేదు. ఇంకో ఏడాది వరకూ నీ పెళ్లిని వాయిదా వేయించలేవా?"

"చాలా కష్టమండీ-- అది నాచేతుల్లో లేదు. ఇప్పటికే నా పెళ్లి ఆలస్యమయిందిట. మా అక్క పెళ్లి నాకంటే చిన్నవయసులో జరిగిందిట"

"మన దురదృష్టం"

"అంతేనంటారా?"

"అవును. మనం ఇలా విడిపోవలసిందే... ఏడాది వరకు నీ పెళ్లి ఆగదు. ఇప్పుడే నా పెళ్లి జరగదు"

ఇలా అన్నప్పుడు శకుంతల కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఈ సంభాషణ తర్వాత శకుంతల ఎదురుగా కూర్చోలేకపోయాను. ఇక ఎంతసేపు మాట్లాడుకున్నా బాధ, గుండెకోత తప్పించి మిగిలేది ఏదీ వుండదు.

వచ్చేశాను.

ఆ తర్వాత కొద్దిరోజులకే శకుంతల పెళ్లి అయింది. నేను వెళ్లలేదు. మా అమ్మ వెళ్లింది. వెళ్లి వచ్చిన తర్వాత బాధ పడింది. కుందనపు బొమ్మలాంటి అమ్మాయిని కొండముచ్చులాంటి వాడికిచ్చి చేశారని. శకుంతల మొగుడు చాలా అసహ్యంగా వుంటాడుట. కట్నం లేకుండా చేసుకున్నాడుట.

"గతిలేక చెయ్యడమేగానీ అతను ఆ అమ్మాయికి ఎదురు కట్నం ఇవ్వాలి" అన్నది.

నా గుండెను ఎవరో పిండినట్టు అనిపించింది. ఇంతకు మించిన రంపపు కోత యేముంటుంది? అయినా తప్పదు. ఎలాగో రాజీ పడాలి. ఇది జీవితం.

ఆ తరువాత నేను మళ్లీ శకుంతలను కలుసుకోలేదు.

చదువయిన నాలుగు నెలలకే ఉద్యోగం వచ్చింది నాకు. ఆ తరువాత నాలుగు నెలలకే అరుణతో నా పెళ్లి జరిగింది.

ఇప్పుడు శకుంతల హైదరాబాద్‌లో వుంటోంది. ఆమె భర్తకు రైల్వేలో ఉద్యోగం.

ఆమెను చూడాలని, మాట్లాడాలని నామనసు తహతహలాడుతోంది. శకుంతల గురించి ఆలోచిస్తూ నిద్రలోకి జారుకున్నాను. మెలకువ వచ్చేసరికి బస్సు హైదరాబాదు నగరంలో పరుగు తీస్తోంది.

+++

పెళ్లి ఉదయమే అయిపోయినా సాయంత్రం వరకు ఆ ఇంటినించి బయట పడటం కుదరలేదు.

ఏడు గంటలు కావస్తున్నప్పుడు శకుంతల ఇంటిని కనుక్కోగలిగాను. నా రాకతో బాగా ఆశ్చర్యపోయింది శకుంతల. తలుపు తీసిన శకుంతలను చూడగానే గుర్తుపట్టలేకపోయాను. అంతగా మారిపోయింది రూపం. ఆమెలో ఇదివరకటి అందం లేదు. సన్నగా, బలహీనంగా కనపడింది. కళ్లలో కాంతి లేదు. నా ఆలోచన నిజమే అయివుంటుంది.

"రండి" అంటూ నవ్వుతూ లోపలకు ఆహ్వానించింది.

మూడుగదుల చిన్న ఇల్లు.

"ఆయన ఇంట్లో లేరా?" అడిగాను.

"లేరు. గంటక్రితమే వెళ్లారు. ఆయనకు నైట్ డ్యూటీ... రాత్రికి రారు"

"అలాగా!"

"మీ పెళ్లికి రాలేకపోయాను. కార్డు పంపినా!" సంజాయిషీ ఇస్తున్నట్టుగా అన్నాను.

"మీత రారని నాకు తెలుసు"

"ఎలా?"

"సారీ– చెప్పలేను"

"పోన్లెండి... ఏమిటీ విశేషాలు? మీ భార్య అందంగా వుంటుందా?"

"నీ అంత అందంగా వుండదు. సాధారణమైన అందం"

"అదృష్టవంతులు"

నవ్వేను.

తరువాత మాకు తెలిసిన వ్యక్తుల గురించి మాట్లాడుకున్నాము.

"ఇక నేను వెళతాను" అన్నాను. అప్పటికి తొమ్మిదయింది.

"ఇప్పుడెలా వెళతారు. చాలా రోజులకు వచ్చారు. ఈ పూట నా ఆతిథ్యం స్వీకరించాలి. ఇక్కడే భోజనం. తప్పదు"

"తప్పదా?"

"తప్పదు. ఒకనాటి ప్రేమికులం. కలసి భోజనం చేద్దాం" అన్నది.

సరేననక తప్పలేదు. నేను మొహమాట పడుతున్నానని మరీ మరీ వడ్డించింది శకుంతల.

భోజనాలయినాయి.

"ఇప్పుడు నాకెంతో తృప్తిగా వుంది. జీవితాంతం మీతో ఇలాగే కలిసి భోజనం చెయ్యాలని కోరుకున్నాను. కానీ కోరిక తీరలేదు. ఏమిటో ఈ జీవితం?" అన్నది నిర్లిప్తంగా శకుంతల.

ఆమె మొహంలోకి చూశాను. విచారం.

"ఇక నేను సెలవు తీసుకుంటాను"

"సెలవా? ఇంత రాత్రివేళ సెలవు ఇవ్వబడదు. ఈపూట మీరు ఇక్కడే పడుకోవాలి. ముందు గదిలో మీకు పక్కవేస్తాను. కొంచెం సేపు కబుర్లు చెప్పుకుని పడుకోవచ్చు"

ఆలోచించాను. నిజానికి నాకు ఆరాత్రి శకుంతల వొంటరిగా వున్న ఆ ఇంట్లో పడుకోవడం ఇష్టంలేదు. తర్వాత ఎలాగో ఆమె భర్తకు ఈ విషయం తెలిస్తే ఎలా వుంటుంది? అందుకే వొప్పుకోలేదు.

"మీరు వచ్చినట్టు ఆయనకు అసలు చెప్పనులెండి. మీ పిచ్చిగానీ అనుమానించే మనిషయితే ఈమాత్రం దానికే అనుమానించవచ్చు" నా ఆలోచనలను చదివినట్టు అన్నది శకుంతల.

జీవితంలో నష్టపోయి చీకట్లో బతుకుతున్నానని అనుకుంటున్న ఆమెను మరింత బాధపెట్టటం ఇష్టంలేక ఆరాత్రి అక్కడే పడుకోటానికి సిద్ధమయ్యాను.

ముందుగదిలో పక్కమీద పడుకున్నాను. ఇంకో గంటసేపు కబుర్లు చెప్పుకున్న తర్వాత నిద్రలోకి జారిపోయాను.

ఎంతసేపు నిద్రపోయానో తెలీదుగానీ ఒకరాత్రివేళ ఎవరో నా పక్కన కూర్చున్నట్లు అనిపించి మెలకువ వచ్చింది.

కళ్లు తెరిచాను.

నా మొహం మీదకు వొంగి నన్నే చూస్తున్న శకుంతల కనిపించింది.

"శకుంతలా!" లేవబోయాను.

"ప్లీజ్... కాదనకండి"

"మతిపోయిందా శకుంతలా... నువ్వు ఎంత నీచమయిన పని చేస్తున్నావో తెలుసా?" ఆమె మొహంలోకి చూస్తూ అడిగాను.

నవ్వింది శకుంతల అదోలా-

"నీచమా? మీ దృష్టిలో నీచం కావచ్చు. కాని నా దృష్టిలో కాదు. నేనూ మనిషినే. నాకూ కోరికలు వుంటాయి. అవి తీర్చుకోవాలనే తపన నాకూ వుంటుంది. మీకు తెలీదు. ఆయన కురూపి. ఆయనకు ఇన్‌ఫీరియర్ ఫీలింగ్ ఎక్కువ. ఆయన సుఖపడుతున్నాడో లేదో తెలీదుగానీ నన్ను మాత్రం కొంచెం కూడా సుఖపెట్టలేక పోతున్నాడు. నేనేం చేసేది? మిమ్మల్ని ఇన్నాళ్ల తర్వాత చూశాను. నాలో ఇప్పటివరకు దాగివున్న అసంతృప్తి రెండింతలయింది. ఇది నేను భరించలేను. ప్లీజ్... ఈ ఒక్కసారి"

శకుంతల ఆర్గ్యుమెంటు ఆమె దృష్టితో చూస్తే సబబుగానే వుంది. కాని అది నిజంగా సరయినదేనా?

"శకుంతలా... ఇది జీవితం. అన్నీ మనం అనుకోనివే జరుగుతాయి. అలాంటప్పుడు మనం చెయ్యగలిగింది ఏదీ లేదు. వాటిని మవునంగా భరించటం తప్పించి. నీ జీవితంలో జరగరానిది జరిగిపోయింది. ఇప్పుడు నువ్వు చెయ్యగలిగింది ఏదీ లేదు. ఈ జన్మకు ఇంతే అని సరిపెట్టుకోవటమే. అయినా మనిషికి అందం అంత ముఖ్యమంటావా? ఆలోచించు"

నా మాటలు శకుంతలమీద పనిచెయ్యలేదు.

"హు... కబుర్లు ఎన్నయినా చెప్పొచ్చు. అనుభవించేవాళ్లకు తెలుస్తుంది ఆ నరకం. మనసును సరిపెట్టుకోవటం అంత సులభంకాదనే విషయం మీకు తెలీదా? ఎందుకు నన్నిలా మభ్యపెట్టాలని చూస్తారు? ఆమాత్రం తెలియని దాన్నా? వద్దు... మీరింకేమీ చెప్పొద్దు. కనీసం మీరయినా నన్ను అర్థం చేసుకుంటారని అనుకున్నాను. నా దురదృష్టం. మీ కళ్లకు నేను నీచమయిన దానిలాగా కనిపించాను" ఏడుస్తూ వెళ్లిపోయింది గబగబా.

ఒకప్పటి అందమయిన శకుంతల. నా వూహా సుందరి. నా జీవన సర్వస్వం... ఈ రోజు నాకో అపూర్వమయిన అవకాశాన్ని కలిగిస్తుందని... నేను దాన్ని నీతి కబుర్లతో కాలదన్నుకుంటానని కలలో అయినా వూహించానా?

అవును. ఇంతకుమించి శకుంతలను నేనేమీ చెయ్యలేను. ఎలాగో కళ్లు మూసుకున్నాను. చాలా సేపటివరకు శకుంతల యేడుపు, ఎక్కిళ్లు వినపడుతూనే వున్నాయి.

తెల్లారి పూర్తిగా తెల్లవారకముందే నిద్రలేచి శకుంతలతో చెప్పి ఆ ఇంట్లోనించి భారమయిన హృదయంతో బయటపడ్డాను.

ఇంటికి వచ్చిన నాలుగు రోజులకు శకుంతల మా ఆఫీసు ఎడ్రసుకు నా పేరున ఓ ఉత్తరం రాసింది. అందులో ఆరాత్రి అలా ప్రవర్తించినందుకు క్షమించమంటూ రాసింది.

ఇప్పటికయినా తన మనసు మార్చుకుని హాయిగా భర్తతో కాపురం చెయ్యమని వెంటనే జవాబు రాశాను.

ఆ తర్వాత శకుంతల నించి ఉత్తరాలు అందుకోవటం గాని, నేను రాయటంగానీ జరగలేదు.

చాలా రోజుల వరకు శకుంతల నా ఆలోచనల్లో నిలచిపోయి వున్నది.

అయిదు నెలలు గడిచాయి.

మరచిపోతున్నానని అనుకున్న జ్ఞాపకాలు, ఆలోచనలు ఒక్కసారి గుప్పుమన్నాయి.

వర్మ మా ఆఫీసుకు హైదరాబాద్‌నించి ట్రాన్స్ఫరయి వచ్చాడు. అతనిది మంచి రూపం. హీరోలా వుంటాడు. ఎప్పుడూ అతని పెదవులమీద చిరునవ్వు వుంటుంది.

చాలా తక్కువ వ్యవధిలోనే మేమిద్దరం మంచి స్నేహితులుగా మారిపోయాము.

ఒకరోజు లంచ్‌టైములో మేమిద్దరం బయటకు వెళ్లకుండా లోపలే కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాము.

వర్మ ఆఫీసు అటెండర్‌ను పిలిచి డబ్బులు ఇచ్చి మా ఇద్దరికీ టిఫిన్ తీసుకు రమ్మని చెప్పాడు.

అతను అలా పర్సును తెరుస్తున్నప్పుడు అప్రయత్నంగానే అతని పర్సులో వున్న ఆ

ఫోటోను చూశాను. ఆశ్చర్యపోయాను. అది ఇంకెవరి ఫోటోనో కాదు.

శకుంతల ఫోటో.

శకుంతల ఫోటో వర్మ పర్సులో ఎలా వుంది?

అటెండర్ వెళ్లిపోయాడు.

"ఈ ఫోటో ఎవరిది? మీ మిసెస్‌దా?" గబుక్కున అడిగాను వర్మను.

నవ్వేడు వర్మ. అతడి నవ్వులో అదోరకమయిన విషాదం కనిపించింది.

"కాదు"

"మరెవరిది?"

"ఈమె పేరు శకుంతల. నా స్నేహితుడి భార్య"

"ఆమె ఫోటో మీ దగ్గర"

"చెప్పుకోవడం బావుండదు. ఐనా చెబుతాను. ఈ ఫోటోలో కంటే ఈమె చాలా అందమయినది. కాని బేడ్‌లక్... ఈమె భర్త... అంటే నా ఫ్రెండ్ చాలా అగ్లీ ఫెలో. ఆమె అతన్ని ఎలా చేసుకున్నదో అర్థంకాలేదు. తర్వాత తెలిసింది. ఆమె ఇష్టంతో ప్రమేయం లేకుండా జరిగిందిట ఆమె పెళ్లి. ఆమె గురించి చాలా జాలిపడ్డాను. అప్పుడప్పుడు ఫ్రెండుకోసం వీళ్ల ఇంటికి వెళ్లేవాడిని. ఆమె అదోలా ఆకలిగా చూసేది. ఆ చూపులను అర్థం చేసుకున్నాను. కాని ఫ్రెండు భార్య. సంకోచించాను. ఒకరోజు వీలుచూసుకుని ఆమె కథనంతా రాసి ఇచ్చింది. చదువుకుని జాలిపడి లొంగిపోయేను. ఆ తర్వాత మరి కొన్నిసార్లు.

ఒకరోజు మేమిద్దరం కలసివుండగా ఆమె భర్త వచ్చాడు. నేను పరుగు దీశాను. కోపంతో చేతికి దొరికిన శకుంతల తలమీద ఇత్తడి ఫ్లవర్‌వాజ్‌తో గట్టిగా కొట్టాడు. తల పగిలింది. హాస్పిటల్లో జేర్పించాడు. అక్కడే శకుంతల చనిపోయింది"

షాక్... షాక్...

నా శకుంతల చనిపోయిందా? ఒక్కక్షణం నాకేమీ అర్థంకాలేదు.

శకుంతలా!!

మవునంగా విలపించాను. అప్రయత్నంగా నా కళ్లలో నీళ్లు తిరిగాయి.

ఈ సంఘటన తర్వాత వర్మ అక్కడ వుండలేక పోయాడు. అందుకే ఇక్కడకు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వచ్చాడు.

వర్మ కళ్లలో కూడా నీళ్లు వచ్చాయి.

విచిత్రం... శకుంతల జీవితం ఇలా అంతమవుతుందని తనుకూడా కలలో ఐనా

వూహించి వుండడు. కానీ జీవితానికి ఎదురు తిరిగి పోరాడాలని అనుకుంటే ఏమవుతుందో తెలిసింది.

"వర్మా... శకుంతలా నేనూ ఒకప్పటి ప్రేమికులం" గబుక్కున అన్నాను.

"నిజంగానా!" అదిరిపడ్డాడు వర్మ.

"అవును. ఈరోజు ఆమె జీవితం ఇలా కావటానికి నేనే కారణం"

"ఎలా?"

శకుంతల కథ మొదలయింది.

(23-4-1980 ఆంధ్రప్రభ వారపత్రికలో ప్రచురితం)